క్లుప్తంగా

క్రీడాకారుల ఎంపిక..

కమలాపూర్ : మండల కేంద్రంలో ఈనెల 29, 30 వ తేదీల్లో క్రీడా సమాఖ్య అద్వర్యంలో క్రీడాకారుల ఎంపికలు చేపట్టనున్నట్లు ఎంఈఓ రామ్‌కిషన్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో అండర్ 14, 17 సంవత్సరాల బాల, బాలికల ఎంపికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ఎంజేపీ (బాలికలు) పాఠశాల క్రీడా మైదానంలో జరిగే ఈ ఎంపికలకు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ బోనోఫైడ్ విత్ డేటాఆఫ్‌బర్త్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు తీసుకురావాలని తెలిపారు. 29వ తేదీన అండర్ 14, 17 బాలుర ఎంపికలు, 30వ తేదీన బాలికల ఎంపికలు ఉంటాయని తెలిపారు.

డీటీఎఫ్ మెంబర్‌షిప్ క్యాంపెయిన్

కమలాపూర్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర, జిల్లా, మండల, బాధ్యులు మెంబర్‌షిప్ క్యాంపెయినింగ్ నిర్వహించారు. అక్టోబర్ నెలలో మహబూబ్‌నగర్‌లో జరిగే 5వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కౌన్సిలర్ సంజీవరెడ్డి ఉపాధ్యాయులను కోరారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, శ్రీనాథ్, ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు అంజనీదేవి, జిల్లా కౌన్సిలర్స్ మహేందర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.

నియామకం..



ఎల్కతుర్తి: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మండలంలోని బావుపేట గ్రామానికి చెందిన ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి గురువారం ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇంద్రసేనారెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

ఎల్కతుర్తి: స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను హనుమకొండలోని ఆయన స్వగృహంలో భీమదేవరపల్లి మండలంలోని దళిత, ప్రజాసంఘాల నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా నియామకమైన సందర్భంగా పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. దళిత, ప్రజాసంఘాల సమస్యలు పరిష్కరించాలని కోరారు. భీమదేవరపల్లిలో భీమ్ కళ్యాణ మండపం కోసం రెండు ఏకరాల భూమితో పాటు భవనం ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత, ప్రజాసంఘాల నాయకులు ద్యాగల సారయ్య, చెప్యాల ప్రకాశ్, కండె రమేష్, మాట్ల వెంకటస్వామి, కండె సుధాకర్, చక్రపాణి, భిక్షపతి, మాడుగుల సంపత్, బొల్లంపల్లి ప్రకాష్, సురేష్, మధుకర్, చందర్, రవి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ఐనవోలు: మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అదే గ్రామానికి చెందిన కేశబోయిన మల్లమ్మ, నీరటి ఐలయ్య, మాదాసు కోర్నేల్, మాణిక్యమ్మ, జన్ను బాబు, బొక్కల వెంకటమ్మ, బొక్కల చిలుకమ్మ, మాదాసి ఏసోబు, ఈద భాస్కర్‌లు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట ప్రజాప్రతినిధులు ఉన్నారు.

పార్టీకి అందరూ సమానమే

ధర్మసాగర్(వేలేరు): ప్రతిభ ఆధారంగా బీఆర్ఎస్ పార్టీలో పదవులు వస్తాయని రాష్ట్ర రైతు బంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సోడషపల్లి గ్రామంలో బుధవారం ఆ పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఉద్యమకారులతో పాటు ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి కూడా పదవులు దక్కుతాయని అన్నారు. సుస్థిరత సాధించడానికే ఇతర పార్టీల వారిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుంటున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారి సమర్థత, అనుభవం, నిజాయితీని గుర్తించి కచ్చితంగా పదవులు లభిస్తాయని అన్నారు. జనగాం జిల్లాలో ఎవరైనా బీఆర్ఎస్ పార్టీలోకి వస్తే పార్టీలో చేర్చుకుంటామని, మిగిలిన పనులన్నీ త్వరలో పూర్తి చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయికి విద్యార్థులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో మండలంలోని కాట్రపల్లి సీఎస్ఐ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లిబియా మాట్లాడుతూ క్రిడలతో మానసికోల్లాసం లభిస్తుందని, విద్యార్థులు, యువకులు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు జాయి, మాథ్యూ, అనిల్‌కుమార్, ప్రవళిక, రవీందర్, రాజునాయక్, అశోక్, శైలజ, మౌన్య, సుహాసిని పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు హేయమైన చర్య

ఎల్కతుర్తి: ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న తమను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీజేపీ మండల అధ్యక్షుడు కడితాటి చిరంజీవి అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను గురువారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. నాయకులు అడెపు శ్రీవర్ధన్, జనగాని కిష్టయ్య, పల్లెపాటి మధూకర్, మధు, గొడిశాల వినయ్‌గౌడ్ అరెస్టయిన వారిలో ఉన్నారు.

ఆత్మకూరు : ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు సదానందం అన్నారు. బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ నాయకుల దాడికి నిరసనగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పరకాల పట్టణంలో నిరసన తెలిపేందుకు వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. దీంతో నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని రాజకీయంగా అనగదొక్కే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. అరెస్టయిన వారిలో ఇర్సడ్ల సదానందం, బీజేపీ కిసాన్ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గట్టు వేణు, ఓబీసీ మండల అధ్యక్షుడు సదానందం, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులు మన్యం రాజిరెడ్డి, రేమిడి మల్లారెడ్డి, మార్త రంజిత్, పోగుల యాదగిరి ఉన్నారు.



ఎల్కతుర్తి: అరెస్టయిన బీజేపీ నాయకులు



ఆత్మకూరు: పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

కమలాపూర్ : శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అధికార పార్టీ ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాల ముట్టడికి వెళ్తున్న జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, ఇతర నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్రూం, నిరుద్యోగ భృతి, తదితర హామీలను వెంటనే నేరవేర్చాలని శాంతియుతంగా నిరసన చేపట్టేందుకు యత్నించిన నేతలపై ప్రభుత్వం, పోలీస్‌లు కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారని ఆరోపించారు. దాడిలో తీవ్ర గాయాలైన వారిని ఆస్పత్రికి తరలించకుండా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లా అధికార ప్రతినిధి తుమ్మ శోభన్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు సారంగపాణి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోటేశ్వర్ పాల్గొన్నారు.

పరకాల: బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి ఉద్రిక్తతకు దారిసింది. బీజేపీ ఇచ్చిన బంద్‌కు మద్దతుగా పట్టణంలోని వ్యాపారస్తులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. బంద్ సందర్భంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీగా వస్తున్న బీజేపీ శ్రేణులను పోలీస్‌లు బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. మరోవైపు బీజేపీ కార్యకర్తలు బస్టాండ్ కూడలి వద్ద స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో 9వ వార్డు కౌన్సిలర్ పూర్ణాచారి స్పృహ కోల్పోయారు. వెంటనే ఆయనను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. బంద్ సందర్భంగా చేపట్టే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు పట్టణానికి చేరుకున్నానని, కానీ పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడం ఎంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులపై దాడిచేసిన బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయకుండా దాడిలో గాయపడ్డ తమనెందుకు అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. సెక్షన్‌లను సైతంమార్చి బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకోకపోవడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, జిల్లా నాయకులు ఆర్‌పీ జయంత్ లాల్, కట్టగాని శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, కౌన్సిలర్ భద్రయ్య, పట్టణ నాయకులు విజయ్, నిరంజన్, రంజిత్, తిరుపతి పాల్గొన్నారు.



పరకాల: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కార్యకర్తలు



కమలాపూర్: మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

ఐనవోలు: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మను అరెస్టు చేయడం సరికాదని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు ఆరోపించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే అండదండలతో పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యే ఆగడాలు బయటపడుతాయోనని ప్రతిపక్ష నాయకులను అడ్డుకుంటున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

శాయంపేట : అక్రమ అరెస్టలతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తున్న తరుణంలో పోలీసులు అడ్డుకొని అరెస్టలు చేయడం హేయమైన చర్య అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి భయం పట్టుకుందని ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని హెచ్చరించారు. నాయకులు తదితరులు ఉన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

దామెర: నేటితరం విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని డిస్నీ ల్యాండ్ పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల డిస్నీల్యాండ్ పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. మొత్తం 824 ఓట్లు పోలవ్వగా స్కూల్ ప్యూపుల్ లీడర్ పదవికి 10 వరగతి విద్యార్థి బానోత్ నితిన్ తన సమీప అభ్యర్థి కేతినేని నాగరాజుపై 81 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు తెలిపారు. అలాగే డిప్యూటీ స్కూల్ ప్యూపుల్ లీడర్‌గా 9వ తరగతికి చెందిన మూడు మనోజ్ తన సమీప అభ్యర్థి తుత్తురు హర్షినిపై 10 ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు ప్రజలకు సేవచేసే నాయకులను ఎన్నుకోవాలని అన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా మంచి మచ్చలేని నాయకున్ని ఎన్నుకుంటనే సమాజం బాగుపడుతుందన్నారు. పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధమని, ఐదేళ్లకు ఒకసారి వచ్చే అవకాశాన్ని స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సూచించారు. భవిశ్యత్‌లో అవకాశాలు వస్తే విద్యార్థులు రాజకీయాల్లో రాణించి దేశానికి నిస్వార్థంగా సేవ చేయాలని అన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల యాజమన్యం అభినందించారు. విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల డైరెక్టర్లు దయ్యాల రాకేష్‌భాను, దినేష్‌చందర్, ఉపాధ్యాయులు హేమంత్, గిరిసామ్యూల్, నరేందర్, హృదయరాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

'చంద్రయాన్-3' సంబురాలు

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని ఆల్టిట్యూడ్ పాఠశాల విద్యార్థులు చంద్రయాన్-3 విజయోత్సవ సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో 140 కోట్ల భారతీయులందరికీ గర్వకారణమైన విషయమని అన్నారు. భారతదేశ శాస్త్రవేత్తలు కృషి చేసి చంద్రుని దక్షిణ ధృవంపై పరిశోధనలు చేసేందుకు ఈ ప్రాజెక్టు విజయవంతం కావడం గర్వించదగ్గ విషయమని విద్యార్థులు కొనియాడారు.



సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థులు

ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

దామెర: ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి రాష్ట్రంలో బీజేపీని అధికారంలోని తీసుకురావాలని హుబ్లీ ధార్వాడ్ హుబ్లీవెస్ట్ ఎమ్మెల్యే అరవింద్‌బెల్లద అన్నారు. ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా మండలంలోని ల్యాదెళ్లలో మండల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నరేంద్ర మోదీవ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చే విధంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, జిల్లా ప్రధానకార్యదర్శులు కొండి జితేందర్ రెడ్డి, ఆర్పీ జయంత్‌లాల్, ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరాంరెడ్డి, ముత్యాల శ్రీనివాస్, కన్వీనర్ ప్రసాద్, కో కన్వీనర్ మాదారపు రతన్‌కుమార్ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవింద్ బెల్లద

చికిత్సపొందుతూ మహిళ మృతి

శాయంపేట : శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద ప్రమీల(45) చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. స్థానిక ఎస్సై దేవేందర్, మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన మంద ప్రమీల రోజుమాదిరిగానే ఈనెల 12వ తేదీన కట్టెల పొయ్యి అంటించేందుకు సిద్ధమైంది. ఆ పొయ్యిలో పెట్రోల్ పోయడంతో మంటల ఒక్కసారిగా చెలరేగి ఆమె చీరకొంగుకు అంటుకున్నాయి. దీంతో ప్రమీల శరీరం కాలిపోగా కుటుంబ సభ్యులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలి కుమారుడు మంద నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి..

దామెర : చికిత్స పొందుతూ ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. దామెర గ్రామానికి చెందిన అర్థం రాజు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా పెద్ద కుమారుడు అర్థం అర్జున్ (17) ఇంటర్ చదువుతున్నాడు. అయితే అర్జున్‌ను పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదివిస్తూ హాస్టల్ చేర్పించారు. కాగా ఈ నెల 3వ తేదీన హాస్టల్‌కు వెళ్లాల్సి ఉండగా అన్ని ఏర్పాట్లు చేసి తండ్రి ఉద్యోగానికి వెళ్లాడు. అర్జున్‌కు హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేకపోవడంతో వారి పాత ఇంటికి వెళ్లి గడ్డి మందు సేవించాడు. గమనించిన బంధువులు ఎంజీఎంకు తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతి అర్జున్ మృతి చెందాడు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలి

శాయంపేట : త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఆశీర్వదించాలని జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి కోరారు. మండల కేంద్రంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన రూ. 2 లక్షల 99వేల 400 విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులు, మండలంలోని మైలారం గ్రామానికి చెందిన సిరిపురం కొమురమ్మకు లక్ష రూపాయల సీఎం సహయనిధి చెక్కును అందించారు. అలాగే రూ. 5లక్షల 5వేల 580విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దామెర: మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, కోగిల్వాయి, ల్యాదెళ్ల ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పీఆర్సీ కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి వెంటనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, జిల్లా బాధ్యుడు చంద్రగిరి లక్ష్మయ్య, మండల బాధ్యుడు రాధాకృష్ణ, సత్తార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బోటనీ విభాగం బీఓఎస్‌గా ముస్తఫా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని బోటనీ విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం ప్రొఫెసర్ మహ్మద్ ముస్తఫా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు బీఓఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన డాక్టర్ లలితకుమారి నుంచి ముస్తఫా బాధ్యతలు స్వీకరించారు.

కాంగ్రెస్ టికెట్‌కు కిరణ్‌గౌడ్ దరఖాస్తు

కేయూ క్యాంపస్: శాసనసభ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ బాధ్యుడు సొల్తి కిరణ్‌గౌడ్ గురువారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్‌భవన్‌లో దరఖాస్తు చేశారు. తనకు టికెట్ ఇవ్వాలని కోరారు.

11 కేవీ విద్యుత్ లైన్ తొలగించాలి

ధర్మసాగర్ (వేలేరు): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల భవనం మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించాలని స్థానిక సర్పంచ్ కాయిత మాధవరెడ్డి కోరారు. ఈ మేరకు జెడ్పీటీసీ చాడ సరితకు గురువారం వినతి పత్రం అందించారు. పాఠశాల భవనంపై నుంచి విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగితే విద్యార్థుల ప్రాణాలకు హాని కలుగుతుందన్నారు. వేలేరు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెడల్పు చేపడుతుండడంతో రోడ్డుకిరువైల పాత విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నారని, పాఠశాల మీదుగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ కూడా తొలగించాలని కోరారు. దీంతో జెడ్పీటీసీ తక్షణమే విద్యుత్ అధికారులను పాఠశాల వద్దకు తీసుకెళ్లి సమస్య వివరించి విద్యుత్ తొలగించి మరో చోటకు మార్చాలని తెలిపారు. వార్డు సభ్యుడు ప్రసాద్, గ్రామ పెద్దలు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

పరకాల: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ మల్లేషం రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్ ఆముదాలపల్లి క్రాంతికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. వారం రోజుల క్రితం మల్లేషం తన రాజీనామా పత్రాన్ని కలెక్టర్‌కు అందించిన విషయం తెలిసిందే. కాగా కలెక్టర్ ఉప సర్పంచ్‌కు బాధ్యతలు ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

శాయంపేట : దళితుల జీవనోపాధి కోసం 100 శాతం సబ్సిడీతో రూ. 10 లక్షల అందజేస్తున్న దళితబంధు పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌తో కలిసి గురువారం లబ్దిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సెప్టెంబరు 10 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

పరకాల బరిలో కొండా మురళీధర్‌రావు..!

పరకాల: కాంగ్రెస్ పార్టీ నుంచి పరకాల ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండ మురళీధర్‌రావు బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం గాంధీభవన్‌లో అతని ప్రధాన అనుచరుడు రమేష్ పరకాల టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొండా మురళి తరపున ఆయన ప్రధాన అనుచరుడు నల్గొండ రమేష్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో దరఖాస్తు అందించారు. పరకాల నుంచి కొండా మురళీ టికెట్ కోరడం చర్చనీయాంశంగా మారింది.

సభ్యత్వ నమోదు

ఐనవోలు: / ధర్మసాగర్: మండలంలోని కొండపర్తి, ముల్కలగూడెం, గర్మిళ్లపల్లి, కక్కిరాలపల్లి, నందనం ప్రభుత్వ పాఠశాలలతో పాటు సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాలలో పీఆర్‌టీయూ (టీఎస్) మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అలాగే ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం, పెద్దపెండ్యాల, ఎల్కుర్తి, కేశవనగర్, కాశగూడెం, జానకీపురం, క్యాతంపల్లి, నారాయణగిరి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం పీఆర్టీయూ (టీఎస్) సభ్యత్వ నమోదును మండల అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరునగరి శ్రీనివాస్, మండలశాఖ అధ్యక్షుడు గుర్రపు రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మైల్‌రెడ్డి, మండల అసోసియేట్ అధ్యక్షుడు సమ్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మండల ప్రధానకార్యదర్శి జాన్‌సింగ్, రాష్ట్ర బాధ్యుడు బండ రమేష్, జిల్లా బాధ్యుడు నరేష్, సూర్య ప్రకాష్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, కుమారస్వామి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం జనఆరోగ్యసమితి సమావేశం ఏర్పాటు చేయగా ఆయన హాజరై మాట్లాడారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలో చేపట్టాల్సిన మరమ్మతులపై తీర్మానం చేశారు. వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ రవీందర్, మండల వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, డాక్టర్ వనజ, సర్పంచ్‌లు శ్రీరాంరెడ్డి, కుక్క శ్రావణ్య, సూపర్‌వైజర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.